



సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్, మడకశిర రూరల్

జిల్లా పరిధిలోని మడకశిర నియోజకవర్గం గుండుమల గ్రామంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆగస్టు ఒకటిన పర్యటిస్తున్న సందర్భంగా సిఎం పర్యటనా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ వి. రత్న శనివారం పరిశీలించారు. ముఖ్యమంత్రి దిగే హెలిప్యాడ్ ప్రాంతాన్ని, సభ ప్రాంగణాన్ని, పింఛన్లు పంపిణీ చేసే సభా స్థలాన్ని స్థానిక పోలీస్ అధికారులతో చర్చించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో తీసుకోవాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటన సందర్భంగా ఎలాంటి భద్రతపరమైన ఏర్పాట్లు చేపట్టాలి, ఏ ఏ ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలి అన్న విషయాలపై ఎస్పీ పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ బాజీ జాన్ సైదా , సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అందుకోసం సత్యసాయి జిల్లా కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ సిబ్బంది శనివారం మడకశిర మండలంలోని గుండుమల గ్రామంలో పర్యటించారు. హెలీ ప్యాడ్‌ను పరిశీలించారు. ముఖ్యమంత్రి కార్యక్రమాల కోసం రూపొందించిన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక ...

అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు బాటిల్ పట్టుకుని సెల్ఫీ విడియోలో మాట్లాడుతున్న అంగన్వాడీ కార్యకర్త నాగమణి

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు, కదిరి టౌన్

శ్రీసత్యసాయి జిల్లా ఓబుళదేరవచెరువు మండల పరిధిలోని వీరప్పగారి పల్లికి చెందిన మినీ అంగనవాడీ వర్కర్ నాగమణి అదేగ్రామానికి చెందిన కొందరి వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అదే గ్రామానికి చెందిన ఆంజనేయులు, కొంతమంది వ్యతిరేకవర్గం వారు తన అంగనవాడీ టీచర్ పోస్టు తొలగిస్తామని బెదిరిస్తూ తనపై లేని పోని ఆరోపణలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని శనివారం అంగన్వాడీ సెంటర్‌లోనే సెల్ఫీ వీడియో రికార్డు చేసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించి కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఘటనకు సంబంధించి బాధితురాలు, స్థానికులు తెలిపిన వివరాలు...
వీరప్పగారిపల్లికి చెందిన నాగమణి మూడు సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కార్యకర్తగా విధుల్లో చేరింది. అప్పటినుంచి అంగన్వాడీకార్యకర్తగా కొనసాగుతోంది. అయితే ఇటీవల టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో గ్రామానికి చెందిన కొంతమంది నాగమణి కుటుంబానికి వ్యతిరేకంగా ఉన్నవారు నాగమణిని అంగన్వాడీ పోస్టు నుంచి తప్పించాలని రాజకీయంగా ప్రయత్నాలు ప్రారంభించారు. నాగమణిని, ఆమె కుటుంబాన్ని మానసికంగా వేధింపులకు గురి చేశారు. ఉద్యోగం నుంచి తొలగింపజేస్తామని పదేపదే ప్రచారం చేశారు. దీంతో నాగమణి మనస్థాపానికి గురైంది. శనివారం అంగన్వాడీ సెంటర్‌లోనే సెల్ఫీ విడియో రికార్డు చేసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయానికి పాల్పడింది. గమనించిన చుట్టుపక్కల వారు నాగమణిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నాగమణి పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు తెలిపారు.

నిందితులను అరెస్టు చేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

నిందితులను అరెస్టు చేయాలంటూ సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

కొండకమర్ల సెక్టరు పరిధిలోని వీరప్పగారిపల్లి మినీ అంగన్వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నానికి కారణమైన టిడిపి నాయకులు ఆంజనేయులు, తదితరులను వెంటనే అరెస్టు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ శ్రీరాములు, మండల కన్వీనర్ కుళ్లాయప్ప, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాబున్నీసా, ప్రాజెక్టు కార్యదర్శి రంగమ్మ, మణి మాల, ఆశీర్వాదమ్మ, కిష్టమ్మ, ఆదిలక్ష్మి, షమీం, వరలక్ష్మి, స్వర్ణ, తదితరులు ఓడిసి తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్త నాగమణిని అదే గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఆంజనేయులు, అతని బంధువులు అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధింపులకు గురి చేశారన్నారు. ఆ అవమానాలను భరించలేక నాగమణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఇందుకు కారణమైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ ఖాజాబీకి అందజేశారు. ఆ తరువాత తహశీల్దార్ కార్యాలయం నుండి ర్యాలీగా పోలీస్ స్టేషన్ వెళ్లి సిఐ రాజేంద్ర నాథ్, ఎస్ఐ వంశీకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు జయమ్మ, కళావతి, అఖిల, చంద్రకళ, మంజుల, వెంకట నరసమ్మ, సుకన్య ,భారతి, శ్యామల ,పార్వతమ్మ, సునంద, విజయమ్మ, సుహాసిని, సునీత భాయ్, సుహాసిని, సుజాత, రమణమ్మ, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన సిఐటియు నాయకులు : ఓడిసి మండలం వీరప్ప గారి పలికి చెందిన అంగనవాడీ సెంటర్ మినీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు జిఎల్ నరసింహులు బాధితురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా జిఎల్ నరసింహులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన టిడిపి నాయకులు నాగమణినిని ఎలాగైనా పోస్ట్ నుంచి తొలగించాలని రాజకీయంగా పలుకుబడి ఉపయోగించి ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చారన్నారు. వారి ఒత్తిళ్లకు తలొగ్గిన పీడీ ఇటీవల విచారణ చేపట్టారన్నారు. పీడీ సూచన మేరకు సీడీపీవో వరలక్ష్మి ఆధ్వర్యంలో సెంటర్‌ను మరో చోటకు మార్చుతున్న నేపథ్యంలో అంగన్వాడీ కార్యకర్త నాగమణి టిడిపి నాయకుల వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిందన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా అంగన్వాడీ కార్యకర్తలను రాజకీయంగా వేధించడం, భయభ్రాంతులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. ఐసిడిఎస్ అధికారులు కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి తలొగ్గి అంగన్వాడీ కార్యకర్తలను వేధించడం సరైంది కాదన్నారు. ఇలాంటి వేధింపులు మానుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, భాగ్యమ్మ, సుజాత, మోక్ష, వెంకటలక్ష్మి, సిఐటియు నాయకులు జగన్మోహన్, బాబ్ జాన్ తదితరులు పాల్గొన్నారు. కదిరి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అంగన్వాడీ కార్యకర్త నాగమణిని సిడిపిఒ వరలక్ష్మి పరామర్శించారు. బాధితురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు.

పీడీ నిర్లక్ష్య ధోరణి : మినీ అంగన్వాడీ కార్యకర్త నాగమణి ఆత్మహత్యయత్నానికి పాల్పడి చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఐసిడిఎస్ ఇన్‌చార్జి పీడీ నాగమల్లేశ్వరి నిర్లక్ష్య ధోరణి అవలంబించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నంపై విలేకరులు పీడీని ఫోన్లో సంప్రదించగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఈ ఘటన ఆమె వ్యక్తిగతమైందని, దీంట్లో ఎలాంటి రాజకీయం లేదని వ్యాఖ్యానించారు. బాధ్యతగల అధికారిగా బాధితురాలుకి అండగా నిలవాల్సింది పోయి వేధింపులకు పాల్పడిన వారికి వత్తాసు పలికేలా మాట్లాడటంపై విమర్శలు వెల్లువెత్తాయి.



ఓడిసి తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు, సిఐటియు నాయకులు



కదిరి ఆసుపత్రిలో బాధితులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఐక్య పోరాటాలతోనే అంగన్వాడీల సమస్యలకు పరిష్కారం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్

ప్రజాశక్తి- బత్తలపల్లి

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం యావత్తు కార్మిక వర్గంతో కలిసి ఐక్యంగా పోరాటాలు చేయడమే ఏకైక మార్గం అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్‌ను బలహీనపరచడంతో పాటు ఎపికి ద్రోహం చేస్తుందని ఆయన మండిపడ్డారు. బత్తలపల్లి అంగన్వాడీ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు రజియా అధ్యక్షతన శనివారం నిర్వహించిన ప్రాజెక్టు జనరల్ బాడీ సమావేశానికి ఈఎస్.వెంకటేష్ హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపితో పాటు రాష్ట్రంలో పని చేసిన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు కార్మికుల ఉద్యమాలను నిరంకుశంగా అణచివేయటానికి పూనుకున్నాయన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన పోరాటాల్లో ఎపిలో అంగన్వాడీల విజయం ఉన్నత స్థాయిలో జరిగిందన్నారు. 2024 జనవరిలో జరిగిన అంగన్వాడీల పోరాటం ప్రపంచ బ్యాంకు సిద్ధాంతాన్ని సైతం తిరిగి రాసిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు గత ప్రభుత్వం చేసిన అగ్రిమెంట్లను అమలు చేయాలని కోరారు. ప్రధానంగా స్కీం వర్కర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, కోశాధికారి సిఎస్.శ్రీదేవి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దిల్షాద్, నాయకులు ఎంవి.రమణ, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు రజియా, వసంత, కోశాధికారి భారతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మానసిక రోగుల్లో మార్పునకు ప్రయత్నించాలి

న్యాయమూర్తులు కంపల్లె శైలజ, శ్రీధర్

ప్రజాశక్తి-హిందూపురం

మానసిక రోగుల్లో మార్పు వచ్చే విధంగా బాధిత కుటుంబ సభ్యులతో పాటు వైద్యులు ప్రయత్నించాలని స్థానిక అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మానసిక సమస్యలు, రుగ్మతలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తులు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు విచ్చలవిడిగా వాడటం వల్ల వాటికి బానిసలై అనేకమంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చెడు వ్యసనాలకు లోను కావడం వల్ల తమ కుటుంబాలు సైతం రోడ్డున పడుతున్నాయన్నారు. దానివల్ల సమాజంలో ఆ కుటుంబంపై గౌరవ మర్యాదలు కూడా లేకుండా పోతాయన్నారు. శారీరక ఆరోగ్యానికి మందులు వాడితే నయం అవుతుందని, మానసిక ఆరోగ్యానికి మందులు ఉండమన్నారు. చెడు అలవాట్లను మానుకోవాలని దృఢ సంకల్పంతో ప్రయత్నిస్తే తప్పకుండా మానుకోవచ్చు అన్నారు. ఈ దిశగా సంబంధిత కుటుంబ సభ్యులు కూడా చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మానసిక వ్యాధిగ్రస్తులకు న్యాయమూర్తులు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్, వైద్యులు రాజగోపాల్, సోమశేఖర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సుధాకర్, కళావతి, పార్వతి, నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.



మానసిక రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న న్యాయమూర్తి కంపల్లె శైలజ

టిడిపి గూటికి మెజారిటీ ఎంపిటిసిలు

రెండోమారు చిలమత్తూరు సర్వసభ్య సమావేశం వాయిదా

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఎవరూ ఊహించని విధంగా వైసిపి ఎంపిపి పురుషోత్తమరెడ్డికి అత్యంత సన్నిహితులుగా పేరున్న ఎంపిటిసిలు టిడిపిలో చేరడంతో చిలమత్తూరులో రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. వివరాలు.. ఈ నెల 24వ తేదీ సర్వసభ్య సమావేశం జరగాల్సి ఉంది. టిడిపి నాయకులు నాగరాజు అనుచరవర్గం నిరసన నేపథ్యంలో ఎంపిపి, ఎంపిటిసి సభ్యులు సమావేశానికి హాజరు కాకపోవడంతో కోరం లేదంటూ అధికారులు వాయిదా వేశారు. 27వ తేదీ సమావేశం నిర్వహిస్తుండడంతో అవాంఛనీ య ఘటనలు జరగకుండా ఎంపిడిఒ కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. శనివారం కూడా సమావేశానికి ఎంపిటిసిలు హాజరు కాకపోవడంతో ఎంపిడిఒ రామ్‌కుమార్ నిరవధికంగా వాయిదా వేస్తూ 90 రోజుల తర్వత సాధారణ సమావేశం జరుగుతుందని వెల్లడించారు. ఇదిలా ఉండగా మెజారిటీ ఎంపిటిసిలు టిడిపిలో చేరి నాయకుల ఆధ్వర్యంలో ర్యాలీగా ఎంపిడిఒ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఎన్నికల ముందు నలుగురు చేరగా తాజాగా టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో ఐదుగురు ఎంపిటిసిలు కవిత, అంజలిదేవి, ఆదినారాయణప్ప, మంజునాథ్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కాశీంతో పాటు కోడూరు సర్పంచి ఈడిగ మురళి, మాజీ సింగిల్‌విండో సభ్యులు హనుమంతురెడ్డి టిడిపిలో చేరారు. రంగారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలక్రిష్ణ సూచన మేరకు పార్టీలో చేర్చుకున్నామనితెలిపారు. ఎంపిటిసిలు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో అభివృద్ధి జరుగుతుందని నమ్మి పార్టీలో చేరామన్నారు. మండలంలో శాంతియుత రాజకీయాలు ఉంటాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి అంజనప్ప తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసి గొల్ల అనూషా, టిడిపి నాయకులు నాగరాజుయాదవ్, గౌరీశంకర్, అంజనప్ప, లక్ష్మినారాయణయాదవ్, శ్రీదేవి, తిప్పారెడ్డి, నందీశప్ప, తదితరులు పాల్గొన్నారు.



సభ్యులు హాజరు కాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



టిడిపిలో చేరిన ఎంపిటిసిలు

వారు.. వీరయ్యారు...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ప్రతిపక్షంలో ఉండగా ప్రజాస్వామిక విలువ గురించి మాట్లాడిన వారేమో అధికారం వస్తూనే మారిపోయారు. నిన్నటి వరకు అంతా తాము చెప్పినట్టే నడుస్తుందని చెప్పిన వారు...ఇప్పుడు ఒకేసారి మాట మార్చి ప్రజా సమస్యలపై మాట్లాడుతున్నారు. అధికారంలోకి వచ్చిన పార్టీ నేతలతేమో తమ అధికార దర్పణాన్ని ప్రదర్శిస్తున్నారు. ఈ ప్రతాపం ప్రధానంగా ఉద్యోగులపై చూపడం ప్రారంభించారు. ఇక చిరుద్యోగుల గురించి వేరే చెప్పనక్కర్లేదు. ఎన్నో ఏళ్లుగా వృత్తిని నమ్ముకుని పనిచేస్తున్న వారందరినీ బలవంతంగా ఇంటికి పంపించే కార్యక్రమాలు యధేచ్ఛగా జరుగుతున్నాయి. స్కిమ్ వర్కర్లపై ఒత్తిడి అధికంగా ఉంటోంది. ఆశ, అంగన్‌వాడీ, యానిమేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఇలా చిన్నచిన్న పనులు చేసుకునే వారందరినీ ఇంటికి పంపించే పనులు చేపట్టారు. రాజకీయపరమైన ఒత్తిళ్లతో ఇది వరకు వజ్రకరూరు మండలంలో మధ్యాహ్న భోజన కార్మికురాలు ఆత్మహత్యాయత్నం పాల్పడిన ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు సత్యసాయి జిల్లాలోని ఓడిసి మండలంలో అంగన్‌వవాడీ కార్యకర్త ఒకరు ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. ఇక ఈ బాధలు తట్టుకోలేక తప్పుకున్న వారి సంగతి వేరే చెప్పనక్కర్లేదు. ఎటువంటి తప్పిదాల్లేకున్నా వారిని విధుల నుంచి తొలగించి వేస్తున్నారు. అనంతపురం జిల్లాలో ఇప్పటికే మధ్యాహ్న భోజన కార్మికులు యాభై శాతం మందిని తొలగించి కొత్తవారిని చేర్చడం జరిగింది. ఇక తక్కిన వాటిని చేర్చే ప్రయత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇక ప్రజాప్రతినిధుల బంధువులు మండల స్థాయి అధికారులను సైతం తమ ఆదేశాల్లేకుండా ఏ పని చేయవద్దని హుకుం జారీ చేసిన ఘటనలున్నాయి. ఇక ఒక నియోజకవర్గంలో అయితే పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులైనా, కేసు నమోదులైనా తమకు తెలియజేయకుండా ఎటువంటి చర్యలు తీసుకోవద్దని ఎమ్మెల్యే సమీప బంధువు ఒకరు సర్కిల్ స్థాయి అధికారికి మౌఖిక ఆదేశాలిచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. ఇలా ప్రతిదీ తమ కనుసన్నల్లో నడవాలన్నట్టుగా కొంత మంది నేతల తీరు మారుతుండటం చర్చనీయాంశమైంది. ఇక ఈ వారంలో తాడిపత్రి ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఆయనపై మోపిన బిఎస్3 వాహనాల కేసు మాజీ ఎమ్మెల్యే సూచనల మేరకే అధికారులు చేసారు కాబట్టి ఇప్పుడు తానిచ్చిన ఫిర్యాదు మేరకు కూడా ఆయనపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీనిచ్చి ఉన్నారు. ఇలా తాడిపత్రి నియోజకవర్గం ఈ వారంలో ప్రధాన అంశంగా మారింది. ఇక ఈ వారంలో ఖరీఫ్ ఆశలు ఆవిరయ్యాయి. సీజన్ ముగుస్తున్నా ఒక పదును వాన పడలేదు. ఇక ఆగస్టులో వర్షాలొచ్చి పంట పెట్టినా పెద్దగా దిగుబడి రాదన్న ఉద్దేశ్యంతో రైతులు సాగుకు సిద్ధపడే పరిస్థితుల్లేవు. ఇక ఖరీఫ్‌పై రైతులు ఆశలు వదిలేసుకునే పరిస్థితులు నెలకొన్నాయి. అయితే తుంగభద్ర పూర్తిగా నీటితో నిండి హెచ్ఎల్‌సికి నీరు రావడం కొంత ఊరటనిచ్చే అంశమని చెప్పాలి. ఆయకట్టు రైతులకైనా నీరందే అవకాశముంది. ఇప్పటికే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటిని విడుదల చేశారు.



విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, సీనియర్ న్యాయవాది సుదర్శన్ సూచించారు. శనివారం హిందూపురం సమీపంలోని ఏపీఆర్జేసీ కళాశాలలో ర్యాగింగ్ నివారణ పై అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపల్ అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి తప్పనిసరిగా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కళాశాలలో ఎవరైనా ర్యాగింగ్ కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయన్నారు. అదేవిధంగా నిబంధనలకు వ్యతిరేకంగా ద్విచక్ర వాహనాలను ఉపయోగించడం వల్ల శిక్షార్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కళావతి, ఎఎస్ఐ వెంకటేశ్వర్లు, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

జైళ్లలో ఉన్న ఖైదీలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం సబ్ జైలులో ఎంతమంది ఖైదీలు ఉన్నారు, ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారు, ఎప్పటి నుండి జైలులో ఉంటున్నారు అన్న విషయాలను జైలు అధికారి అంజి నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయమూర్తి ఖైదీలతో మాట్లాడారు. జైలులో అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత, నీరు తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ, క్షణికావేశంలో తప్పులు చేసి జైళ్లకు రావడం వల్ల అటు ఆర్థికంగా నష్టం వాటిల్లడంతో పాటు కుటుంబాలు కూడా గౌరవ మర్యాదలను కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, న్యాయవాదులు కళావతి, పార్వతి, నవేరా, నరసింహమూర్తి, వేణుగోపాల్, లోక్ అదాలత్ సిబ్బంది శారద తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తిలో పరిశుభ్రత పాటించాలి

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



మున్సిపల్ కమిషనర్ అంజయ్య

పుట్టపర్తి పట్టణంలో పరిశుభ్రత, సుందరీకరణలో పట్టణ ప్రజలు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య పిలుపునిచ్చారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సత్యసాయి దర్శనార్థం దేశ, విదేశాల నుంచి భక్తులు, పర్యాటకులు వస్తుంటారని, కావున పట్టణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఇళ్లలోని వ్యర్థాలను చిత్రావతి నది పరివాహక ప్రాంతం, బ్రాహ్మణపల్లి రహదారికి ఇరువైపులా ఎక్కడబడితే పడేయడం తగదన్నారు. చెత్త దిబ్బలతో వెలువడే దుమ్ము, ధూళితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. ఇకనుంచైనా కర్నాటక నాగేపల్లి వద్ద ఉన్న డంపు యార్డులో వ్యర్థాలు వేయాలని ఆదేశించారు. ఎక్కడబడితే అక్కడ వ్యర్థాలు వేస్తే రూ. 10వేల జరిమానాతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా వ్యర్థాలను రహదారికి ఇరువైపులా పడేస్తే ప్రజలు వెంటనే మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయాలని, అలాంటి వాహనాలను ప్రతిఘటించాలని ఆయన కోరారు.

రోడ్లపై పశువులు వదిలితే క్రిమినల్ కేసు

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపాలిటీ పరిధిలో ఇకపై ఎక్కడైనా రోడ్లపై పశువులను వదిలితే వాటి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలో రోడ్లపై తిరుగుతున్న పశువులను శుక్రవారం రాత్రి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శంకర్, నిజాం, మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక వాహనంలో మున్సిపల్ కార్యాలయానికి తరలించారు. వాటి యజమానులతో శనివారం కమిషనర్ సమావేశం నిర్వహించి ఇకపై రోడ్లపై పశువులను వదలమని లిఖిత పూర్వకంగా లేఖలు తీసుకుని పశువులను వారికి అప్పగించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రధాన రహదారులపై పశువులు గుంపులుగా చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. ప్రజల ఇబ్బందులు, ప్రమాదాల నివారణలో భాగంగా ఇకపై రోడ్లలో పశువులను వదిలితే వాటి యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

హిందూపురం : ఇటీవల రూరల్ మండలంలోని గోళాపురం గ్రామానికి చెందిన టిడిపి మద్దతుదారుడి దాడిలో మృతి చెందిన వైసిపి మద్దతుదారుడు సతీష్ కుమార్ కుటుంబానికి వైసిపితో పాటు తాము అండగా ఉంటామని వైసిపి జిల్లా అధ్యక్షులు నవీన్ నిశ్చల్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి భరోసా ఇచ్చారు. వారు శనివారం వైసిపి తరఫున మృతుడి ఉకుటుంబానికి రూ. 5 లక్షల చెక్కును అందించారు. వారు మాట్లాడుతూ సతీష్ కుమార్ మరణానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-గోరంట్ల



విచారణ చేపట్టిన ఆర్‌డిఒ వెంకట శివరాంరెడ్డి

మండలంలోని గుంటిపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని నారాయణరెడ్డి అనే వ్యక్తి పేరుపై రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకం, వన్-బి చేయడంపై ఇటీవల గ్రామస్తులు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేయడంతో పాటు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై శనివారం ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వెంకట శివరాంరెడ్డి గుంటిపల్లి వెళ్లి పాఠశాల స్థలాన్ని పరిశీలించి గ్రామస్తు లతో విచారణ చేపట్టారు. అలాగే భూమి రికార్డులను పరిశీలించారు. నారాయణరెడ్డి పట్టాదారు పుస్తకంలో పేర్కొన్న సర్వే నెంబర్ 510లోని భూమి ప్రభుత్వ పాఠశాలకు చెందినదే అన్నారు. అప్పట్లో ప్రభుత్వ పాఠశాల కోసం 1.13 ఎకరా భూమిని ప్రభుత్వం ల్యాండ్ అక్వైరేడ్ చేసిందన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని ఆర్‌డిఒ తెలిపారు.

ముగిసిన టీచ్ టూల్ శిక్షణ

హిందూపురం : పట్టణంలోని ఎంజిఎం పాఠశాలలో నిర్వహిస్తున్న 9 రోజుల టీచ్ టూల్ శిక్షణ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో శిక్షణ డైరెక్టర్, ఎంఇఒ గంగప్ప మాట్లాడుతు శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు స్నేహ పూర్వకంగా విద్యా బోధన సాగించాలని సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు మాట్లాడుతూ శిక్షణ చాలా బాగా ఉపయోగపడిందని, దీనిని పాఠశాల స్థాయిలో అమలు పరుస్తామన్నారు. అనంతరం కోర్సు డైరెక్టర్, ఎంఇఒతో పాటు స్టేట్ అబ్జర్వర్ అబ్రహం, ఎఎంఒ మహేందర్ రెడ్డి, ఎంఇఒ-2 ప్రసన్నలక్ష్మి, ఎంజిఎం సామ్రాజ్యం, ఆర్పీలు ఓబుళరాజు, రంగనాథరాజు, అపర్ణ, అశోక్‌లను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సి సిబ్బందితో పాటు హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి, మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం, ఆరోగ్యం

గాండ్లపెంట : విద్యార్థినులు క్రీడల్లో పాల్గొంటే ఉల్లాసంగా, ఉత్సాహంగా, ఆరోగ్యంగా ఉంటారని ఎంఇఒ శ్రీనివాసులు, ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్ శాంతమ్మ, ఎస్ఐ కృష్ణవేణి సూచించారు. ఆర్‌డిటి ఆధ్వర్యంలో శనివారం స్థానిక జడ్పీ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన రూరల్ గర్ల్స్ అథ్లెటిక్స్‌లో లాంగ్ జంప్, రన్నింగ్, షాట్‌పుట్ పోటీల్లో రెక్కమాను, కటారుపల్లి, గూటుబైలు జడ్పీ హైస్కూల్ విద్యార్థినులు పాల్గొన్నట్లు ఎటిఎల్ మహబూబ్‌బాషా తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒతో పాటు ఆర్‌డిటి రీజినల్ డైరెక్టర్, ఎస్ఐ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం సిద్ధారెడ్డి, ఉపాధ్యాయులు పామిడి ముంతాజ్‌అలీ, గంగాధర్, పీఈటీలు పాపారాయుడు, హరి, ఉపాధ్యాయులు ఆర్‌డిటి సిబ్బంది పాల్గొన్నారు.

'అధికార పార్టీ' దౌర్జన్యాలపై ఫిర్యాదు

గోరంట్ల : అధికార పార్టీ నాయకుల బెదిరింపులు, దౌర్జన్యాలపై శనివారం వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో నిరుపేదలు సిఐ సుబ్బ రాయుడుకు ఫిర్యాదు చేశారు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సహాయ కార్యదర్శి గంగాధర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం పోరాడుతూ రెండేళ్ల క్రితం పాల సముద్రం క్రాస్‌లోని ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నార న్నారు. ఇది సహించలేని కొందరు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు పేదల నివాసం ఉంటున్న ప్రాంతంలోకి వచ్చి దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. నిరుపేద అయిన నాగమణి ఇంటి గోడలను కూల్చి వేశారని, వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ కదిరప్ప, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకులు అంజలిదేవి, అశ్వర్థమ్మ, వెంకటరాముడు, నంజుండప్ప, శాంతమ్మ, రత్నమ్మ, నూర్జహాన్, బాబా, తదితరులు ఉన్నారు.



సిఐ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేస్తున్న వ్యకాసం నాయకులు

హత్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధం

అసెంబ్లీకి వచ్చే ధైర్యం లేకనే జగన్ ఢిల్లీలో ధర్నా : రాష్ట్ర బిసి సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని ఆరోపిస్తున్న వైసిపి అధినేత జగన్ హత్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి ఎందుకు రావడం లేదని బిసి సంక్షేమం, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత ప్రశ్నించారు. హత్యలపై చర్చకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే అసెంబ్లీకి రాకుండా ముఖం చాటేసిన వ్యక్తి పులివెందుల ఎమ్మెల్యే అని ఎద్దేవా చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి దర్గా సర్కిల్ వరకూ డివైడర్ల మధ్య చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని శనివారం మంత్రి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 36 హత్యలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్‌ను వాటిపై చర్చించేందుకు అసెంబ్లీకి రావాలని సిఎం చంద్రబాబు పిలిచినా రాకుండా ఢిల్లీలో ధర్నా చేయడం హాస్యాస్పదం అన్నారు. హత్యల వివరాలు ఇవ్వాలని హోం మంత్రి అనిత సైతం జగన్‌కు ఛాలెంజ్ చేశారన్నారు. తాము కక్ష సాధింపు రాజకీయాలు చేయమని, అభివృద్ధే ధ్యేయం అన్నారు. అంతకు ముందు అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న కలాం విగ్రహానికి మంత్రి, డీఎస్పీ బాబిజాన్ సైదా పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలుర గురుకుల పాఠశాలను మంత్రి సందర్శించా విద్యార్థులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. వాటిని తక్షణం పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రధాన మురుగు కాలువను పరిశీలించి మున్సిపల్ కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. మంత్రి వెంట తహశీల్దార్ ఉదయ శంకరరాజు, కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, టిడిపి పట్టణ, మండల కన్వీనర్లు శ్రీరాములు, సిద్దయ్య, నాయకులు మాధవనాయుడు, శ్రీనివాసులు, కౌన్సిలర్ గిరి, ప్రసాద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, లక్ష్మీదేవి ఉన్నారు.



కాలేజీ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి సవిత

అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు దుర్మార్గం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా స్కీం వర్కర్లు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, అవుట్ సోర్సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆర్‌పిలు, కాంట్రాక్టు కార్మికులపై అధికార పార్టీ శ్రేణులు రాజకీయ వేధింపులకు పాల్పడడాన్ని సిఐటియు మండల కమిటీ సభ్యులు గంగాధర్, బాబావలి తీవ్రంగా ఖండించారు. కార్మికులపై బెదిరింపులు, దౌర్జన్యాలు, రాజకీయ వేధింపులను ఆపకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

నల్లచెరువు : ఒడిసి మండలంలోని వీరప్పగారిపల్లికి చెందిన మినీ అంగన్వాడీ టీచర్ నాగమణి పై అధికార పార్టీ నాయకుల వేధింపులకు పాల్పడం సరికాదని సిపిఎం మండల కన్వీనర్ రామకృష్ణ పేర్కొన్నారు. కేవలం గౌరవేతనం తీసుకునే చిరుద్యోగులపై అధికార పార్టీ శ్రేణులు పెత్తనం చేయడం ఎంతవరకూ న్యాయమని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జిఎల్. నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : అంగన్‌వాడీ కార్యకర్తలపై అధికార పార్టీ నాయకుల వేధింపులు ఆపాలని సిఐటియు మండల కార్యదర్శి ముత్యాలు, అంజి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒడిసి మండలానికి చెందిన అంగన్వాడీ కార్యకర్త నాగమణిపై టిడిపి నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి వేధించడంతో ఆమె అంగన్వాడీ కేంద్రంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని, ఇలాంటి సంఘటనలపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అంగన్వాడీ కార్యకర్తను పరామర్శిస్తున్న సిపిఎం నల్లచెరువు మండల కన్వీనర్ రామకృష్ణ

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా స్కీం వర్కర్లు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, అవుట్ సోర్సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్లు, కాంట్రాక్టు, కార్మికులపై అధికార పార్టీ శ్రేణులు రాజకీయ వేధింపులకు పాల్పడడం దుర్మార్గమని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆయన మాట్లాడుతూ కొండకమర్ల పంచాయతీలోని వీరప్పగారిపల్లిలో ఉద్యోగం నుంచి తొలగించాలనే ఉద్దేశంతో అంగన్వాడీ కార్యకర్తపై అసత్య ఆరోపణలు చేయడం, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆమె అంగన్వాడీ సెంటర్‌లోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కార్మికులపై రాజకీయ వేధింపులు ఆపాలని, లేనిచో ఎమ్మెల్యేలు, మంత్రులను ఎక్కడికక్కడ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అడ్డుకుంటామని హెచ్చరించారు.



ఖాద్రీ సన్నిధిలో జిల్లా జడ్జి సత్యవాణి



కర్నాటక లోకాయుక్త జడ్జి బి.వీరప్పకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

ఖాద్రీశుని సన్నిధిలో జడ్జిలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

పట్టణంలో వెలసిన ఖాద్రి లక్ష్మీనరసింహస్వామిని శనివారం అనంతపురం జిల్లా జడ్జి సత్యవాణి దర్శించుకున్నారు. జడ్జికి ఈవో పార్థసారథి, కుమారశాస్త్రి స్వాగతం పలికారు. జడ్జి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయగా అర్చకులు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రాలను అందించారు. అలాగే ఆలయ విశిష్టతను వివరించారు. జడ్జి వెంట స్థానిక న్యాయమూర్తులు మీనాక్షిసుందరి, ప్రతిమ, రూరల్ సిఐ వెంకటేశ్వర్లు, ఆలయ, కోర్టు సిబ్బంది ఉన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న కర్నాటక జడ్జి

కదిరి టౌన్ : కర్నాటక లోకాయుక్త జడ్జి బి.వీరప్ప శనివారం కుటుంబ సమేతంగా ఖాద్రీశున్ని దర్శించుకున్నారు. జడ్జి వీరప్పకు ఆలయ తూర్పు రాజగోపురం వద్ద ఆలయ కార్యనిర్వహణధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి, ప్రధాన అర్చకులు పూర్ణకుంభం స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీవారు, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జడ్జికి ఆలయ అధికారులు శ్రీవారి చిత్ర పటం, శేషవస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి సన్నిధిలో..

నల్లచెరువు : మండలంలోని పాలపాటిదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామిని శనివారం అనంతపురం జిల్లా జడ్జి సత్యవాణి, కదిరి జడ్జి మీనాక్షి సుందరి, ప్రతిమ దర్శించుకున్నారు. జడ్జిలకు ఆలయ అర్చకులు స్వాగతం పలకగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి ఆలయ ఈఓ రవీంద్రరాజు, అర్చకులు శాలువాతో సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. కార్యక్రమంలో వనం గంగిరెడ్డి, అర్చకులు ఆంజనేయదాసు, నాగరాజు, రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు

రొద్దం : తనపై దాడికి పాల్పడిన బోయ నాగరాజుపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరుతూ శనివారం బాధితుడు నారాయణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి హెడ్ కానిస్టేబుల్ నాగరాజుకు ఫిర్యాదు చేశాడు. వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నార్సింపల్లి ఆంజనేయులు, మాట్లాడుతూ మండలంలోని కోగిర గ్రామానికి చెందిన జె.నారాయణతో పాటు దళితులు, బిసిలు సర్వే నంబర్-669లోని ప్రభుత్వ భూమిలో 20 ఏళ్లుగా పంటలు సాగు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. ఈ ఏడాది కూడా మహిళా రైతులు, నారాయణ పొలంలో పనులు చేసుకుంటుండగా టింబక్టు అనే స్వచ్ఛం ద సంస్థకు చెందిన చిరంజీవి నాగరాజు, బొక్సంపల్లి బాలు, శివ ప్రోద్బలంతో కోగిర గ్రామానికి చెందిన బోయ నాగరాజు(టింబక్టు సంస్థ వాచ్‌మెన్) నారాయణను కులం పేరుతో దుర్భాషలాడడంతో పాటు దాడికి ప్రయత్నం చేశాడన్నారు. కావున టింబక్టు సంస్థ ప్రతినిధులు, వాచ్‌మెన్ నాగరాజుపై తక్షణం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని, లేనిచో భవిష్యత్తులో నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మాదిగలను ఏకతాటిపైకి తెస్తాం

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మాదిగలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడానికి రాష్ట్రవ్యాప్తంగా మాదిగలను ఏక తాటిపైకి తెస్తామని మహాజన సోషలిస్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ వైకె.విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక సాయి ఆరామంలో శనివారం ఆయన జిల్లాలోని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి సంఘాల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్‌పి ఎన్డీఏ కూట మికి మద్దతుగా ఉంటూ వారి గెలుపునకు కషి చేసినందుకు ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారని, దానిని వెంటనే అమలు చేయాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నాయకత్వాన్ని పటిష్టం చేయడంలో భాగంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేస్తున్నామన్నారు. ప్రజల కోసం పోరాడే వ్యక్తిని గుర్తించి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పజెబుతామని తెలిపారు. సమావేశంలో ఆంజనేయులు, ఎంఇఎఫ్ గౌరవ సలహాదారుడు తిప్పన్న, నరసింహులు, వెంకట్రాముడు, రంగప్ప, కమ్మవారి పల్లి నరసింహులు, బండ్లపల్లి నరసింహులు, సాయిప్రసాద్, రమణ, సైకిల్ నరసింహులు, చంద్ర, గంగులప్ప, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు.

సామాజిక సేవకులకు సన్మానం

హిందూపురం : సామాజిక సేవకులకు ఎప్పటికైనా గుర్తింపు లభిస్తుందని అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ పేర్కొన్నారు. తమిళనాడుకు చెందిన ద్రావిడ మున్నేట్ర, కజగం షఫీయుద్దీన్, రయాన్‌లకు శనివారం పట్టణంలోని యునైటెడ్ ఫ్రంట్ కార్యాలయంలో ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ అధ్యక్షులు ఉబెదుల్లా హుసేన్ అధ్యక్షతన టిప్పు సుల్తాన్ సామాజిక సేవా పురస్కారాలు అందించారు. అలాగే వారిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో అహలే హదీస్ జమాత్ అధ్యక్షులు మౌలానా ఉస్మాన్ ఘనీ, సున్నీ జమాత్ అధ్యక్షులు మహబూబ్ దౌలా సాహెబ్, మౌలానా షాబుద్దీన్, కిసాన్ నాయకులు సోమశేఖర్ రెడ్డి, ఇబ్రహీం సాబ్, జైనబ్, నయాజ్, అమ్రాన్ అల్తాఫ్, హాజీనాసిర్, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాశక్తి-లేపాక్షి

పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్రలో భాగంగా శనివారం జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్, డిఇఒ మీనాక్షి నవోదయ, ఎపిఆర్ఎస్, కెజిబివిల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమం లో ఎంఇఒ నాగరాజునాయక్, నవోదయ ప్రిన్సిపల్ నాగరాజు, మహాత్మా జ్యోతి బాపూలే పాఠశాల ప్రిన్సిపల్ శ్యామ్ సుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరిగి : స్థానిక జడ్పీ హైస్కూల్‌లో టిడిపి నాయకులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జడ్పిటిసి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు మారుతిప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి, చౌడప్ప, శ్రీనివాసులు, చంద్రశేఖర్, డిఎస్ఎల్ శ్రీనివాసులు, నాగరాజు, కుమార్, వడ్డే శ్రీనివాసులు, రంగనాథ్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు వైద్య పరీక్షలు

కదిరి అర్బన్ : ప్రతి ఒక్కరూ ముందస్తు వైద్య పరీక్షలు చేయించుకో వాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షులు నాగేంద్రరెడ్డి సూచించారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కోర్టు ఆవరణలో బెంగళూరులోని వైదేహి వైద్యశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో న్యాయవాదులకు వివిధ వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. వైదేహి ఆసుపత్రి వైద్యులు సురేష్, ప్రశాంత్ మాట్లాడుతూ వైదేహి వైద్యశాలలో ఎన్టీఆర్ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు వాసుదేవరెడ్డి, మహమ్మద్ ఫైజుల్లా, నాగేంద్ర, వైదేహి వైద్యశాల వైద్యులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

సోమందేపల్లి : మండలంలోని గుడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు శనివారం బెంగళూరుకు చెందిన జిఎన్‌వి శాంతమ్మ, రంగయ్యశెట్టి జ్ఞాపకార్థం వారి కుమారులు జి.మురళి, జి.సత్యనారాయణ ఎంపిడిఒ ఆంజనేయ నాయక్, శ్రీసజ్జగంట రఘునాథస్వామి ఆలయ పురోహితులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉచితంగా బ్యాగులు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, జామెట్రీ బాక్సులు, వాటర్ బాటిల్స్, తదితర సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం హనుమంతరాయుడు మాట్లాడుతూ రంగయ్య శెట్టి కుటుంబ సభ్యులు ఏటా విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రంగయ్య శెట్టి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు చంద్ర, గణేష్, విజయలక్ష్మి, నరసింహమూర్తి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి మంత్రి ఆర్థికసాయం

రొద్దం : ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందిన మండలంలోని చిన్నమంతూరు గ్రామానికి చెందిన అనిల్ కుమార్ (30) కుటుంబానికి మంత్రి సవిత ఆర్థిక సాయం అందజేశారు. అలాగే మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాధవనాయుడు, వీరాంజి, శ్రీనాథ్‌గుప్తా పాల్గొన్నారు.

ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

కదిరి టౌన్ : రూరల్ మండలంలోని ఎర్రదొడ్డి తండాలో(బోడేనాయక్‌తండా, మిట్టే నాయక్ తండా, రాందాస్ నాయక్ తండా)లో శనివారం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సులేమాన్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 224 మందికి వివిధ వైదయ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఇచ్చారు. శిబిరంలో 104 సిబ్బంది, నాయకులు డాక్టర్ ఓంకార్ నాయక్, మాజీ ఎంపీపీ ఈశ్వర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అరికడతాం : ఎస్పీ

ప్రజాశక్తి-గోరంట్ల



పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ రత్న

ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసి జిల్లా వ్యాప్తంగా చోరీలు, అసాంఘిక కార్యకలాపాలను అరికడతామని ఎస్పీ రత్న స్పష్టం చేశారు. ఎస్పీ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ గోరంట్ల స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న 320 కేసులపై విచారణ చేశామన్నారు. గోరంట్ల పట్టణానికి కర్నాటక ప్రాంతం దగ్గరలో ఉండటం వల్ల ప్రత్యేక నిఘాతో పాటు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామన్నారు. పోలీసు సిబ్బంది సంఖ్యను పెంచి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ బాబిజాన్ సైదా, సిఐ సుబ్బరాయుడు ఉన్నారు.

ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తచెరువు రూరల్ : జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ జిల్లా పరిషత్, మునిసిపల్ (ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలు) హెచ్ఎంలు, ఉపాధ్యాయుల నుంచి 2023-24 సంవత్సరానికి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేషనల్ ఫౌండేషన్ ఫర్ టీచర్స్ వెల్ఫేర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొంది. 2 సెట్ల దరఖాస్తులను ఆగస్టు 5వ తేదీ లోపు సంబంధిత మండల విద్యాశాఖాధికారి/ఉప విద్యాశాఖాధికారికి అందజేయాలన్నారు. నిబంధనలు వర్తిస్తాయన్నారు.

కొత్తచెరువు : అండర్-14, 17 జిల్లా ఎస్‌జిఎఫ్ సెక్రటరీ నియామకాల కోసం జిల్లా పరిషత్, బాలుర మున్సిపల్ పాఠశాలల్లో పని చేసే వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డిఇఒ మీనాక్షి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యాయామ సహాయకులు, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల ద్వారా కార్యదర్శులను ఎన్నుకుంటారని, ఎన్నికైన వారు రెండేళ్లు ఆ పదవిలో కొనసాగుతారన్నారు.

బీరే ఈశ్వరయ్యకు డాక్టరేట్ ప్రదానం

గోరంట్ల : పట్టణానికి చెందిన సీమ వార్త పత్రిక ఎడిటర్ బీరే ఈశ్వరయ్యకు తమిళనాడులోని హోసూరు పట్టణంలో ఉన్న ఇంటర్నేషనల్ కల్చర్ ఏషియా యూనివర్సిటీ నిర్వాహకులు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. జర్నలిజంలో వ్యాసాలపై డాక్టరేట్, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డును యూనివర్సిటీ నిర్వాహకులు అందజేసినట్లు అవార్డు గ్రహీత ఈశ్వరయ్య తెలిపారు.



డాక్టరేట్ అందుకుంటున్న ఈశ్వరయ్య

అబ్దుల్ కలాంను కలిసిన క్షణాలు మరువలేనివి

పుట్టపర్తి అర్బన్ : ప్రముఖ శాస్త్రవేత్త, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను కలిసిన మధుర క్షణాలు మరువలేనివని రాష్ట్ర టిడిపి మైనార్టీ విభాగం కార్యదర్శి ఎస్.మహమ్మద్ రఫీ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆనాడు కలాం కళ్యాణదుర్గం పర్యటనలో భాగంగా సత్యసాయి విమానాశ్రయానికి వచ్చారన్నారు. అప్పటి సిఎం చంద్రబాబు, ఆర్‌జె రత్నాకర్, పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి విమానాశ్రయంలో కలాంకు స్వాగతం పలికే అదృష్టం తనకు కలిగిందన్నారు. అలాగే కలాంకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపామన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా ఆయన నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.



విమానాశ్రయంలో కలాంతో రఫీ(ఫైల్ ఫొటో)

గర్భిణులకు భోజనం ఏర్పాటు

రొద్దం : స్థానిక పిహెచ్‌సిలో వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులకు శనివారం మంత్రి సవిత భోజనం ఏర్పాటు చేశారు. మంత్రి సవిత ఆసుపత్రి వచ్చే గర్భిణులకు రెండేళ్లుగా పౌష్టికాహారం, భోజన వసతి కల్పిస్తున్నట్లు టిడిపి మండల నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్‌నాయుడు, పెట్రోల్ బంక్ కిష్టప్ప, చంద్రశేఖర్, సిద్దన్న, లింగప్ప పాల్గొన్నారు.